## క్లుప్తంగా

### నైట్ షెల్టర్ నిర్వహణ సక్రమంగా ఉండాలి



**తెనాలిఅర్బన్:** నైట్ షెల్టర్ నిర్వహణను సక్రమంగా జరిగేలా చూడాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న సూచించారు. 6వ వార్డులోని నైట్ షెల్టర్‌ను గురువారం ఆయన పరిశీలించారు. అక్కడ ఉన్న నిరాశ్రయులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. నిరాశ్రయులను జాగ్రత్తగా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం 33వ వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించారు. ఆయన వెంట మెప్మా సీఎంఎం మాధవరావు, పలువురు మున్సిపల్ ఉద్యోగులు ఉన్నారు.

### పేదలకు అన్నదానం



**తెనాలిఅర్బన్:** శ్రీ వెంకటేశ్వర యోగ సేవా కేంద్రం సభ్యులు వేజండ్ల నాగూర్‌బాబు, సౌజన్య దంపతుల కుమార్తె హీషిక ద్వితి జన్మదినాన్ని పురస్కరించుకుని రైల్వేస్టేషన్ రోడ్డులోని శివ లింగేశ్వరస్వామి భక్త బృంద సేవా సమితి అన్నదాన కేంద్రంలో పేదలకు గురువారం అన్నదానం చేశారు. యోగా కన్వీనర్ ముద్దా భక్తుని రమణయ్య, బాలిక కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

### చిరుజల్లులతో కూడిన వర్షం



**తెనాలిఅర్బన్:** అల్పపీడనం ప్రభావంతో తెనాలి పట్టణంలో బుధవారం రాత్రి నుంచి గురువారం మధ్యాహ్నం వరకు చిరుజల్లులతో కూడిన వర్షం కురిసింది. ముసురు, చిత్తడితో కూడిన వాతావరణంతో ప్రజలు కొంత ఇబ్బందులు పడ్డారు.

### 21న 'తల తిరుగుడు'పై అవగాహన

**తెనాలి:** వాకర్స్ క్లబ్, తెనాలి జూలై నెల సమావేశం ఈనెల 21వ తేదీ సాయంత్రం 5.30 గంటలకు స్థానిక కవిరాజపార్కులోని వీజీకే భవన్‌లో జరుగుతుందని అధ్యక్ష, కార్యదర్శులు గుత్తా వెంకటరత్నం, కడియాల రవి బాబు గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సమావేశంలో ప్రముఖ వైద్యుడు డాక్టర్ సీహెచ్ భానుప్రసాద్ 'తలతిరుగుట-చెవిలో మోత-వినికిడిలోపం' అంశంపై ప్రసంగిస్తారని తెలిపారు. తలతిప్పుట, తల తిరగటం, తూలడం మొదలైన లక్షణాలను 'వెర్టిగో' అంటారని..చెవిలో మోత, వినికిడి లోపం నేడు చాలామందికి వస్తోందనీ, చెవిలో జబ్బుకు, తూలుడుకు కొన్ని సందర్భాల్లో సంబంధం ఉందని, ఈ సమస్యలపై డాక్టర్ భానుప్రసాద్ అవగాహన కల్పిస్తారని వివరించారు.

### తడి,పొడి చెత్త వేర్వేరుగా ఇవ్వాలి



**మేడికొండూరు:** మండలంలోని డోగిప్రరు గ్రామ పంచాయతీలో ప్రతి ఇంటి వద్ద నుంచి వ్యర్థాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. హరితరాయబారుల ద్వారా సేకరించిన చెత్త నుంచి సంపద తయారీ జరుగుతోందని పంచాయతీ సెక్రటరీ బి.రమేష్, మాజీ ఎంపీపీ సుబ్బారావు తెలిపారు. కేంద్రంలో వ్యర్థాలను వేరు చేసి వాటిని ఎరువుగా మార్చి గ్రామ పంచాయతీకి ఆదాయం సమకూర్చడం జరుగుతోందన్నారు. గ్రామ ప్రజలందరూ, దుకాణదారులు ఇళ్ల వద్దకు వచ్చే హరిత రాయబారులకు ఇంటినుంచి వచ్చే వ్యర్థాలను తడి, పొడి చెత్తగా వేరు చేసి ఇవ్వాలన్నారు. గ్రామ ప్రజలందరూ గమనించాలన్నారు. ప్రస్తుత వర్షాకాలం సీజన్‌లో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సచివాలయ సిబ్బంది, ఇంజినీరింగ్ అసిస్టెంట్ శర్వాణి, గ్రామ పంచాయతీ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

### శరవేగంగా ఉచిత వైద్యసేవల భవనం

**ఫిరంగిపురం:** మండలంలోని వేమవరం గ్రామంలో కోటిలింగాల క్షేత్రం ఆధ్వర్యంలో ఉచిత వైద్యసేవలు అందించేందుకు భవన నిర్మాణ పనులు చేపట్టినట్లు ఆలయ నిర్వాహకులు గురువారం తెలిపారు. గ్రామంలోని ప్రజలకు ఉచితంగా వైద్యసేవలు అందించేందుకు వీలుగా భవనం నిర్మించి అందులో అర్హుడైన వైద్యుడిని ఏర్పాటుచేసి ఉచితంగా మందులు అందించనున్నట్లు తెలిపారు. భవన నిర్మాణ పనులు త్వరితగతిన చేస్తున్నామని, పనులు పూర్తి అయిన తరువాత ఉచిత వైద్యాన్ని అందించనున్నట్లు తెలిపారు.

# ఆదర్శ న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ రాధారాణి

- ఉన్నతమైన వ్యక్తిత్వం, హేతువాద భావాలు ఆమె సొంతం
- కుల నిర్మూలన ఉద్యమానికి కృషి చేసిన మానవతావాది
- రేపు తెనాలిలో మొవ్వా విజయలక్ష్మి స్మారక అవార్డు ప్రదానం



**తెనాలి:** భావోద్యమాల పురిటిగడ్డ తెనాలి బిడ్డ జస్టిస్ డాక్టర్ గురిజాల రాధారాణి. న్యాయవిద్యను అభ్యసించారు. న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తూ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా, డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జిగా పనిచేశారు. ప్రస్తుతం తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తిగా విధులు నిర్వర్తిస్తున్నారు. హేతువాద ఉద్యమ కేంద్రంగా నడిచిన తెనాలిలోని తన ఇంట్లో బాల్యం నుండే తండ్రి హేతువాద భావాలను పుణికిపుచ్చుకున్నారు. కులాంతర వివాహం చేసుకుని ఆచరించి చూపారు. కుల నిర్మూలన ఉద్యమానికి కృషి చేశారు. ఆ మానవతావాది బిడ్డలు కూడా తల్లిదండ్రులనే అనుసరించారు. ఆదర్శ న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ రాధారాణి శనివారం తెనాలిలో మొవ్వా విజయలక్ష్మి స్మారక అవార్డు-2024ను స్వీకరించనున్నారు.

- తెనాలిలో 1963 జూన్ 29న జన్మించారు రాధారాణి. ఆంధ్రా యూనివర్సిటీ మెట్రిక్యులేషన్ చేశారు. ఇంటర్ తర్వాత తెనాలిలోని వీఎస్సార్ కాలేజీలో బీఎస్సీ చదివారు. ఏలూరులో బీఎల్ చేశాక, ఉస్మానియా యూనివర్సిటీలో క్రిమినల్ లాలో ఎల్ఎల్ఎం పూర్తిచేశారు. హ్యూమన్ రైట్స్‌పై న్యూఢిల్లీలో, ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్‌పై ఉస్మానియాలో పీజీ డిప్లమాలు చేశారు. ఉస్మానియా యూనివర్సిటీ నుంచే 2009లో న్యాయశాస్త్రంలో పీహెచ్‌డీ చేశారు. 1989లో బార్ కౌన్సిల్‌లో న్యాయవాదిగా నమోదై, ఏలూరు, విజయవాడలో తర్వాత హైకోర్టులో ప్రాక్టీస్ చేశారు. 1998లో హైదరాబాద్‌లో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఎంపికయ్యారు. అక్కడే పలు కోర్టుల్లో విధులు నిర్వహించారు. ప్రత్యక్ష నియామకంలోనే అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ గ్రేడ్-2గా తర్వాత డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జిగానూ ఎంపికై పలుచోట్ల పనిచేశారు. తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా చీఫ్ జడ్జిగా పనిచేస్తున్నపుడే 2021లో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. ప్రస్తుతం అదే హైకోర్టులో న్యాయమూర్తి బాధ్యతల్లో ఉన్నారు.
- హేతువాద ఉద్యమానికి జీవితాన్ని అంకితం చేసిన ఆదర్శ దంపతులు గురిజాల సీతారామయ్య, భారత రాజేశ్వరి ముగ్గురు కుమార్తెల్లో రాధారాణి ఒకరు. తెనాలిలో ఎక్కడ దిగినా 'విమానం మేడ'కు వెళ్లాలంటే నేరుగా తీసుకొచ్చేంత గుర్తింపు ఆ ఇంటికి. హేతువాద ఉద్యమంలో జీవితాంతం కృషిచేసిన సీతారామయ్య, తెలుగునాట హేతువాదులకు చిరపరిచితుడు. రామలింగేశ్వరపేటలోని తన నివాసానికి ఎం.ఎస్.రాయ్ భవనంగా పేరు పెట్టారు. తన కుమారుడికి ఎం.ఎస్.రాయ్ పేరిట నామకరణం చేశారు. ఎన్నో కులాంతర, మతాంతర వివాహాలను జరిపించారు. ఆయనకు నలుగురు సంతానం. అందులో ముగ్గురు ఆడపిల్లలు. ఆడపిల్లలనే వివక్ష లేకుండా వారికీ ఆర్థిక స్వావలంబన ఉండాలని చక్కగా చదివించారు.
- తండ్రి భావాలకు ప్రభావితులైన పిల్లలంతా ఆదర్శ వివాహాలే చేసుకున్నారు. రాధారాణి, సీఎల్ఎన్ గాంధీల కులాంతర వివాహాన్ని జస్టిస్ ఆవుల సాంబశివరావు, న్యాయశాఖ మాజీ కార్యదర్శి జాగర్లమూడి వీరాస్వామి జరిపించారు. రాధారాణి భర్త సీఎల్ఎస్ గాంధీ రవాణాశాఖలో అడిషనల్ కమిషనరుగా రిటైరై, హైదరాబాద్‌లోనే స్థిరపడ్డారు. ప్రస్తుతం హైకోర్టు న్యాయవాదిగా, కన్సల్టెంటుగా పనిచేస్తున్నారు. వీరిరువురూ హేతువాదులు, కులనిర్మూలన సంఘంలో చురుకుగా పనిచేశారు. వీరి కుమార్తె చేతన అమెరికన్ పౌరసత్వం పొంది లీగల్ కన్సల్టెంటుగా ఉన్నారు. మరో కుమార్తె మానవి, ఎంబీబీఎస్, ఎండీ చేసి పంజాబ్‌లోని పాటియాలాలో గల మణిపాల్ ఆసుపత్రిలో సీనియర్ రెసిడెంట్ డాక్టరుగా ఉన్నారు. తల్లిదండ్రులు ఆదర్శంగా కుమార్తెలిద్దరూ కులాంతర వివాహాలే చేసుకున్నారు.

### రేపు మొవ్వా విజయలక్ష్మి స్మారక అవార్డుల ప్రదానోత్సవం



మొవ్వా విజయలక్ష్మి (ఫైల్)

**తెనాలి:** గుంటూరు జిల్లా తెనాలి పట్టణానికి చెందిన విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయిని, సేవామూర్తి మొవ్వా విజయలక్ష్మి స్మారక అవార్డు ప్రదానోత్సవం ఆమె వర్ధంతి రోజైన శనివారం తెనాలిలో జరగనుంది. మొవ్వా విజయలక్ష్మి స్మారక సేవా సమితి ఆధ్వర్యంలో ఆ రోజు ఉదయం 9.30 గంటలకు స్థానిక తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో నిర్వహించే సభకు సమితి వ్యవస్థాపకుడు మొవ్వా సత్యనారాయణ అధ్యక్షత వహించనున్నారు. తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ గురిజాల రాధారాణికి ఈ అవార్డు ప్రదానం చేసి, సత్కరించనున్నారు. అనంతరం జస్టిస్ రాధారాణి 'విద్యార్థుల భవిష్యత్ సవాళ్ల'పై మొవ్వా విజయలక్ష్మి స్మారకోపన్యాసం చేయనున్నారు. తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖర్‌జైన్, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక ముఖ్య అతిథులుగా పాల్గొంటారు. గత మార్చిలో పదో తరగతి పరీక్షల్లో 550కుపైగా మార్కులు సాధించిన 26 మంది విద్యార్థులకు రూ.5 వేల చొప్పున నగదు ప్రోత్సాహకం, జ్ఞాపికను కూడా ఇదే వేదికపై అందించనున్నట్లు మొవ్వా సత్యనారాయణ వెల్లడించారు. ఈ అవార్డును 2022లో సీనియర్ ఐపీఎస్ అధికారి కేజీవీ సరితకు, 2023లో తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మకు ప్రదానం చేసినట్లు గుర్తుచేశారు.

# చోదకులు హెల్మెట్ తప్పక ధరించాలి

**11వ అదనపు జిల్లా న్యాయమూర్తి డి.శ్రీనివాసులు**



ర్యాలీలో పాల్గొన్న న్యాయమూర్తులు, న్యాయవాదులు, పోలీసులు

**తెనాలిరూరల్:** ద్విచక్రవాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని తెనాలి మండల న్యాయ సేవ అధికార సంస్థ చైర్మన్, 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి డి.శ్రీనివాసులు అన్నారు. హెల్మెట్‌ధారణ ఆవశ్యకతపై అవగాహన కల్పించేందుకు తెనాలి మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక కొత్తపేటలోని న్యాయస్థానాల ప్రాంగణం వద్ద నుంచి హెల్మెట్ ర్యాలీని న్యాయమూర్తులు, తెనాలి బార్ అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి జిల్లా జడ్జి శ్రీనివాసులు ప్రారంభించారు. ఈ ర్యాలీలో పెద్ద సంఖ్యలో న్యాయవాదులు, పోలీస్ అధికారులు, సిబ్బంది, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ హెల్మెట్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రజలందరూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. హెల్మెట్ ధరించడం వల్ల అనుకోని ప్రమాదాలు జరిగినప్పటికీ ప్రాణాపాయం తప్పుతుందని తెలియజేశారు. అదేవిధంగా వాహన చట్టాలపై ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎం.శ్రీధర్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎ.పవన్ కుమార్, రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి పి.రాజశేఖర్, తెనాలి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బేతాళ ప్రభాకర్ తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సెక్రటరీ హరిదాసు గౌరీ శంకర్, వన్‌టౌన్ సీఐ జి.దశరథరామయ్య, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ టి.రాఘవరావు, న్యాయవాదులు గుమ్మడి రవిరాజు, పెరికల డానియల్, సురేష్, పిల్లి సుధాకర్, లీగల్ సర్వీసెస్ అథారిటీ సిబ్బంది మహబూబ్, విజయ, ఆర్.వెంకటేశ్వరరావు, ఖాదర్ హుస్సేన్, పారా లీగల్ సిబ్బంది నాగమణి, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ర్యాలీ కోర్టు దగ్గర నుంచి గాంధీ చౌక్ వరకు కొనసాగింది.

# వైద్యులు, నర్సులకు ఘనసన్మానం

**దుగ్గిరాల, ఈమని వైద్యసిబ్బందికి బీసీ రాయ్, ఫ్లోరెన్స్ నైటింగేల్ పురస్కారాలు**



పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ అబ్దుల్ రెహమాన్, డాక్టర్ ఇందిర, నర్సులను సత్కరిస్తున్న దృశ్యం

**తాడేపల్లిరూరల్:** దుగ్గిరాల మండల పరిధిలోని దుగ్గిరాల, ఈమని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని వైద్యులు, నర్సులకు ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ ఆధ్వర్యంలో డాక్టర్ బి.సి.రాయ్, ఫ్లోరెన్స్ నైటింగేల్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ బీసీ రాయ్, ఫ్లోరెన్స్ నైటింగేల్‌లు తమ జీవితాన్ని రోగుల, ప్రజల సేవకు అంకితం చేశారన్నారు. వారిని ఆదర్శంగా తీసుకుని వైద్యులు, నర్సులు, సిబ్బంది పేదలకు వైద్యసేవలందించాలన్నారు. అనంతరం దుగ్గిరాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఈమని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న నలుగురు వైద్యులకు డాక్టర్ బి.సి.రాయ్ పురస్కారాలు (శాలువ, జ్ఞాపిక, పగడి, పూలమాల) మరియు ఆరుగురు నర్సులకు ఫ్లోరెన్స్ నైటింగేల్ పురస్కారాలు (శాలువ, జ్ఞాపిక, పుష్పమాలలు) అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు వెనిగళ్ల శ్రీకృష్ణ ప్రసాద్, కొంగర జోగేంద్రప్రసాద్, బాలరాజు, దోస్త్ అధ్యక్షులు మిక్కిలినేని గాంధీ, నల్లనూకల వెంకటేశ్వరరావు, షేక్ సుభాని, కుర్రా నాగయ్య, తాడిబోయిన పూర్ణయ్య, వెంకటేష్, గద్దె వాసు, బి.ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

### ఇరువర్గాల ఘర్షణ

**పది మందిపై కేసు నమోదు**

**మేడికొండూరు:** ఇరువర్గాల ఘర్షణలో పది మందిపై కేసు నమోదు చేసినట్లు మేడికొండూరు పోలీసులు తెలిపారు. సేకరించిన వివరాల మేరకు పేరేచర్ల గ్రామానికి చెందిన మర్రిపాలెం మీరావలి, అదే గ్రామానికి చెందిన షేక్ ఘన్‌సైదాలు మంగళవారం రాత్రి గ్రామంలో జరిగిన పీర్ల పండుగ సమయంలో గొడవపడ్డారు. ఘన్‌సైదా బంధువులు, మీరావలి బంధువులు ఇరువర్గాలు ఘర్షణ ప్రదేశానికి వచ్చి దాడులు చేసుకున్నారు. దాడిలో పలువురికి తీవ్రగాయాలయ్యాయి. ఘటనపై ఇరువర్గాల వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఘన్‌సైదా అన్న సుభాని, మీరావలి అన్న జాన్‌పీరాలతో పాటు మరో ఎనిమిది మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### ఉండవల్లిలో సబ్సిడీ విక్రయ కేంద్రం ప్రారంభం

**తాడేపల్లిరూరల్:** మంగళగిరి-తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని ప్రజల సౌకర్యార్థం ఉండవల్లిలో నిత్యావసర సరుకుల ప్రత్యేక కౌంటర్ కేంద్రాన్ని టీడీపీ మండల, పట్టణ అధ్యక్షులు అమరా సుబ్బారావు, వల్లభనేని వెంకట్రావులు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ సబ్సిడీ కేంద్రాల్లో కిలో కందిపప్పు రూ.160, సోనా మసూరి బియ్యం కిలో రూ.48లకు విక్రయిస్తారని, పేదలు, మధ్యతరగతి కుటుంబాల వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

# హెల్మెట్ ధారణపై అవగాహన

**తాడేపల్లిరూరల్:** మంగళగిరి రూరల్ పరిధిలోని నవులూరు గ్రామంలో మంగళగిరి మండల పారా లీగల్ వలంటీర్(పీఎల్‌వీ) కారుమంచి రామారావు ఆధ్వర్యంలో నవులూరులోని ఆర్టీవీ కార్యాలయం, ట్యాంక్ సెంటర్‌లలో హెల్మెట్ ధారణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కారుమంచి రామారావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఆదేశాల ప్రకారం మంగళగిరి లీగల్ సెల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి నాగరాజు ఆదేశాల మేరకు ఈనెల 10వ తేదీ నుంచి జరుగుతున్న 'హెల్మెట్ ధరించండి.. ప్రాణాలను కాపాడుకోండి' అంశంపై హెల్మెట్ ఆవశ్యతకపై అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. ఇందులో భాగంగా ప్లకార్డులు పట్టుకుని వేగం వద్దు, ప్రాణం ముద్దు, అతివేగం ప్రమాదకరం, మద్యం సేవించి వాహనం నడుపరాదు, హెల్మెట్ ధరించండి ప్రాణాలు కాపాడుకోండి అంటూ నినాదాలు చేసుకుంటూ ప్రజలకు అవగాహన కల్పించామని అన్నారు. ఈ కార్యక్రమానికి పర్యవేక్షకులుగా మంగళగిరి కోర్టు న్యాయవాది దొడ్డక శ్రీనివాసరావు వ్యవహరించగా, ఆర్టీఓ విజయసారథి, సామాజిక కార్యకర్తలు బూసి గోవిందరాజు, పాస్టర్ స్టీఫెన్, అలివేలమ్మ, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

# అవుట్‌ఫాల్ డ్రెయిన్ పూడికతీత

**తాడేపల్లిరూరల్:** మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని చినకాకాని నుంచి వర్షపునీరు, మురుగునీరు బయటకు వెళ్లేందుకు కార్పొరేషన్ అధికారులు పూడికతీత పనులను గురువారం ప్రారంభించారు. చినకాకాని శివారు ప్రాంతంలో మురుగునీరు వెళ్లే కచ్చా డ్రెయిన్లలో సిల్ట్ పేరుకుపోయి, మురుగునీరు, వర్షపు నీరు ప్రధాన వీధుల్లోంచి ప్రవహించడం కష్టంగా మారింది. దీంతో ఇంజినీరింగ్ అధికారులు అవుట్‌ఫాల్‌లో చెత్తాచెదారం తీసివస్తే మురుగునీరు బయటకు పోతుందని భావించి ఎంటీఎంసీ కమిషనర్ ఆలీబాషా దృష్టికి తీసుకువెళ్లడంతో యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టాలని ఆదేశించడంతో డీఈ కృష్ణారెడ్డి పర్యవేక్షణలో సుమారు 500 మీటర్ల పొడవున పూడికతీత పనులను చేపట్టారు. ఈ డ్రెయిన్ వల్ల మురుగునీటి సమస్య 90 శాతం పరిష్కారం అవుతుందని సచివాలయ ఇంజినీరింగ్ సిబ్బంది తెలిపారు.

### షార్ట్‌సర్క్యూట్‌తో రెండు పూరిళ్లు దగ్ధం

**రూ.6 లక్షల మేర ఆస్తినష్టం వాటిల్లిందని బాధితుల ఆవేదన**



**దొండపాడు(తాడికొండ):** తుళ్లూరు మండలం దొండపాడు గ్రామంలో గురువారం రెండు పూరిళ్లు అగ్నికి ఆహుతయ్యాయి. ఈ ప్రమాదంలో గ్రామానికి చెందిన నన్నపనేని నాగేశ్వరరావు, నన్నపనేని హనుమంతరావులకు చెందిన గృహాలు ప్రమాదంలో పూర్తిగా దగ్ధమయ్యాయి. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేశారు. రెవెన్యూ అధికారులు నష్టం వివరాలు నమోదు చేశారు. ఒక్కో ఇంటికి రూ.3 లక్షల మేర ఆస్తినష్టం వాటిల్లినట్లు బాధితులు వాపోతున్నారు.

## పెట్టుబడి సాయంపై ఎన్నికల హామీని అమలుచేయాలి

- ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జొన్న శివశంకరరావు
- సబ్ కలెక్టర్ కార్యాలయం ఏఓకు వినతిపత్రం అందజేత



సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏఓకు వినతిపత్రం అందజేసిన శివశంకరరావు

**తెనాలి:** రైతులు, కౌలు సాగుదార్లకు పెట్టుబడి సాయం రూ.20 వేలు ఇస్తామన్న రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీని అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జొన్న శివశంకరరావు డిమాండ్ చేశారు. రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులతో కలిసి గురువారం సబ్ కలెక్టర్ కార్యాలయం పరిపాలనాధికారి ఎ.జయజయరావుకు తమ డిమాండ్‌తో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. అదేవిధంగా పట్టణ అయితానగర్, రూరల్ మండల గ్రామాలైన కఠెవరం, ఎరుకులపూడిలోని సచివాలయాల్లోనూ వినతిపత్రాలను ఇచ్చారు. అనంతరం రైతుసంఘ బృందంతో కలిసి తెనాలి గోలిడొంక రోడ్డు, నేలపాడులో వరి విత్తనాలు వెదపెట్టిన వరిచేలల్లో నీరు నిలిచి ఉండటాన్ని పరిశీలించారు. అనంతరం శివశంకరరావు స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌లోనూ కేరళ తరహా రుణవిమోచన చట్టాన్ని అమలు చేయాలని అభిప్రాయపడ్డారు. రైతులు, కౌలురైతులకు బ్యాంకుల్లో ఉన్న రూ.2 లక్షల వరకు ఉన్న అన్ని రకాల రుణాలను మాఫీ చేయాలని కోరారు. రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివ సాంబిరెడ్డి మాట్లాడుతూ పంటకాల్వలు, మురుగుకాల్వల్లో అల్లుకుపోయిన తూటాకు, గుర్రపు డెక్కను సత్వరమే తొలగించాలని కోరారు. నష్టపోయిన పసుపు రైతులకు పరిహారం ఇచ్చేందుకు ప్రభుత్వం వెంటనే పూనుకోవాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జెట్టి బాలరాజు మాట్లాడుతూ అయిదారు వారాలుగా ఉపాధి కూలీలకు ఇవ్వాల్సిన పెండింగ్ బిల్లులను వెంటనే ఇప్పించాలనీ, భూ యజమానితో సంబంధం లేకుండా కౌలురైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. వీరితో యార్లగడ్డ బ్రహ్మేశ్వరావు, భీమవరపు అమ్మిరెడ్డి, మద్దెన సాంబశివరావు, బసివిరెడ్డి, గోపాలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తెనాలి డిపోకు త్వరలో 10 కొత్త బస్సులు



మాట్లాడుతున్న డీఎం ఎ.రాజశేఖర్

**తెనాలిఅర్బన్:** తెనాలి డిపోకు నూతనంగా 10 కొత్త బస్సులు త్వరలో రానున్నట్లు ఏపీఎస్ఆర్టీసీ తెనాలి డిపో మేనేజర్ ఎ.రాజశేఖర్ గురువారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల తెనాలి నుంచి బెంగళూరుకు ఏర్పాటు చేసిన బస్సుకు మంచి ఆదరణ లభిస్తుందని తెలిపారు. అలాగే విజయవాడ బస్సుకు కూడా ఆదరణ ఉందన్నారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సహకారంతో చెరుకుపల్లి, గుంటూరు, ఎర్రగొండపాలెంకు కొత్త బస్సులు నడిపేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అలాగే ప్రయాణికుల కోరిక మేరకు కొన్ని బస్సుల వేళలను కూడా మార్పు చేయడం జరిగిందన్నారు. ప్రమాదాలు జరగకుండా డ్రైవర్లకు ప్రతిరోజు శిక్షణ ఇస్తున్నట్లు వివరించారు. శుభ కార్యాలు, దేవాలయాల సందర్శనలకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తామని, కావాల్సిన వారు తమను సంప్రదించాలన్నారు. స్టూడెంట్ బస్సు పాసులు ఉదయం 7గంటల నుంచి కౌంటర్‌లో ఇవ్వడం జరుగుతుందని, ఎక్కువ మంది విద్యార్థులు ఉన్న కళాశాలలు, పాఠశాలల నిర్వాహకులు తమను సంప్రదిస్తే తమ ఉద్యోగులు అక్కడకు వచ్చి జారీ చేస్తారని, ఈ అవకాశాన్ని యాజమాన్యాలు ఉపయోగించుకోవాలని సూచించారు.



## శాకంబరిగా కనకదుర్గ

**ఆషాఢ మాసం సందర్భంగా**

తెనాలి రూరల్ మండలం నందివెలుగు గ్రామంలోని కనకదుర్గ అమ్మవారి ఆలయంలో గురువారం అమ్మవారికి కూరగాయలతో శాకంబరీదేవి అలంకరణ చేశారు. గ్రామప్రజలు, దేవీ భక్తబృందం పాల్గొన్నారు.

– తెనాలి

## టీచ్ టూల్‌పై అవగాహన అవసరం

**ఎంఈఓ లక్ష్మీనారాయణ**



**తెనాలిఅర్బన్:** బోధనలో ఉపాధ్యాయులకు టీచ్ టూల్ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందని మండల విద్యాధికారి మేకల లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. నాజర్‌పేటలోని సెయింట్ జాన్స్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో గురువారం ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరగతి గదుల్లో బోధనా కార్యక్రమం ఎలా జరుగుతుందో అనే అంశంపై పరిశోధనలు చేయడం జరిగిందన్నారు. దీనిలో భాగంగా ఉపాధ్యాయులకు బోధనలో ఇంకా సహకారం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందన్నారు. ఈ నెల 28 వరకు శిక్షణ కొనసాగుతుందన్నారు. ఎంఈఓ-2 వి.జయంతిబాబు మాట్లాడుతూ బోధనాభ్యాసనలో పరిశీలన అనేది చాలా కీలకమైన అంశం అన్నారు. శిక్షణలో నేర్చుకున్న ప్రతి అంశాన్ని గుర్తు పెట్టుకుని తరగతి గదుల్లో బోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. సమావేశంలో అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ సాయిప్రసాద్, ఉపాధ్యాయులు పి.పద్మ, య.ప్రసాద్, జీవీ బాలసుందర్, ఎం.అభిగయల్, ఎస్.విజయలక్ష్మి, కె.శ్రీమన్నారాయణ, కె.పద్మజ, బీహెచ్ శ్రీదర్, జె.ప్రకాశరావు, స్లాట్ కో-ఆర్డినేటర్ వీరయ్య, తెనాలి డివిజన్ పరిధిలోని పలువురు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## చిర్రావూరులో కంటి వైద్యశిబిరం

**తాడేపల్లిరూరల్:** ఎంటీఎంసీ పరిధిలోని చిర్రావూరులో టీడీపీ గ్రామ అధ్యక్షుడు వీరిశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విజయవాడ శంకర నేత్ర చికిత్సాలయం సహకారంతో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ సుమారు 100 మందికి పైగా వైద్య పరీక్షలు నిర్వహించారని, వారిలో 20 మందికి ఆపరేషన్ చేయాల్సి ఉందని, 30 మందికి కళ్లజోళ్లు అవసరం ఉందని తెలిపారు. కంటి పరీక్షలు నిర్వహించిన అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేశామని తెలిపారు. అవసరమైనవారికి ఆరోగ్యశ్రీ ద్వారా కంటి ఆపరేషన్లు చేయించుకోవచ్చని వివరించామన్నారు. శంకర నేత్ర చికిత్సాలయం వైద్యులు, సిబ్బంది, జనసేన నాయకులు పాల్గొన్నారు.

### పన్నులు సత్వరం చెల్లించాలి

**ఫిరంగిపురం:** పంచాయతీ పరిధిలో ఇంటిపన్ను చెల్లించాల్సిన యజమానులు త్వరితగతిన చెల్లించాలని పంచాయతీ కార్యదర్శి కె.విష్ణువర్ధనరావు అన్నారు. ఫిరంగిపురం పంచాయతీ పరిధిలో ఇప్పటివరకు 50శాతం ఇంటిపన్నులు వసూలు చేశామన్నారు. గ్రామంలోని రాజాపేట, కొత్తపేట, రసూల్‌పేట, తూర్పుబజార్, ప్రధానరోడ్, సాలనబస్టాండు సెంటర్, వంటి ప్రాంతాల్లో ఇంకా వసూలు కావాల్సి ఉందన్నారు. పన్నులు చెల్లించి పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని కోరారు.